సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 6 । డిసెంబర్ । 2023



ఉద్యోగమే లక్ష్యంగా..

ఉద్యోగమే లక్ష్యంగా స్కిల్ హబ్‌లలో కోర్సులు నిర్వహిస్తున్నారు. యువత కూడా మొగ్గు చూపుతోంది. - 8లో



కంది సాగు..

కంది సాగు పెరుగుతోంది. గట్టుపై సాగు బాగని వ్యవసాయాధికారులంటున్నారు. - 8లో



ట్రైనీ జవాన్ ఆత్మహత్య

ట్రైనీ బీఎస్ఎఫ్ జవాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

తీగ లాగుతున్నారు..



స్టేట్‌బ్యాంకు వద్ద క్యూలో ఖాతాదారులు

శ్రీకాకుళం క్రైమ్, గార : గార ఎస్బీఐ బంగారం కేసులో జిల్లా పోలీసులు తీగ లాగే కొద్దీ.. డొంక కదులుతోంది. ఇప్పటికే కేసు విచారణాధికారిగా ఉన్న ఇన్‌చార్జి డీఎస్పీ ఎ.విజయ్‌కుమార్ తన టీమ్‌తో కలిసి ఆధారాలు సేకరిస్తూ, స్టేట్‌మెంట్లు తీసుకుంటూ కొందరిపై నిఘా పెడుతున్నారు. రెండు రోజుల నుంచి శ్రీకాకుళం బ్రాంచి ఉద్యోగికి, కేసులో కీలకమైన, పరారైన వ్యక్తికి కాల్‌డేటా నుంచి ఇతరత్రా లావాదేవీలున్నాయన్న కోణంలో పోలీసులు విచారణ జరిపారు. కానీ మంగళవారం ఆమదాలవలసకు సంబంధించిన ఓ బ్రాంచి ఉద్యోగిని అదుపులో తీసుకుని విచారించారు. ఆత్మహత్యకు పాల్పడిన మహిళా బ్యాంకు ఉద్యోగిని అందించిన 26 బ్యాగుల్లో కొన్ని ఈయన వద్ద నుంచి వచ్చినట్లు భోగట్టా. ఆమదాలవలస ఉద్యోగికి, పరారైన వ్యక్తికి ఇంకా ఫోన్ కాల్స్ జరుగుతున్నట్లు అనుమానం రావడంతో పోలీసులు ఆ దిశగా విచారిస్తున్నారు.

ఖాతాదారులకు సమాచారం

స్థానిక ఎస్‌బీఐలో బంగారం మాయంపై ఖాతాదారులకు బ్యాంకు సిబ్బంది వివరాలు వెల్లడిస్తున్నారు. మంగళవారం ఖాతాదారులు తాకిడి ఎక్కువగా ఉండటంతో రెండు కౌంటర్ల ద్వారా సమాచారాన్ని ఇవ్వడంతో మధ్యాహ్నం నాటికి చాలా వరకు ఆందోళన తగ్గింది. డీఎస్పీ విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు వేగవంతం చేశారు. సోమవారం నాటికే పలువురుని అదుపులోకి తీసుకున్న పోలీసులు స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఖాతాదారుల ఆందోళన అనంతరం పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో పోలీసులు కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ప్రత్యేక అలంకరణలో విజయగణపతి



శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయంలో కార్తీక మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

చింతామణి అమ్మవారికి ప్రత్యేక పూజలు



కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం.. కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారికి లలితా సహస్ర నామసహిత కుంకుమార్చనలు నిర్వహించారు.

పశువ్యాధులపై అప్రమత్తం

ఆమదాలవలస రూరల్: పశువులకు సక్రమించే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీఏ ఆర్.ఆనందరావు తెలిపారు. మండలంలోని కట్యాచార్యులపేట గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పాడి-పంటతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించుకోవచ్చునని తెలిపారు. వర్షాకాలంలో పశువులకు పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పశువైద్య శిబిరాన్ని నిర్వహించి, పశువులకు టీకాలు వేశారు.



బందరువానిపేట తీరంలో తుఫాన్ ప్రభావంతో ఎగసి పడుతున్న అలలు

ముప్పు తప్పినట్టే

- కనికరించిన మిచాంగ్ తుఫాన్
- అక్కడక్కడా జల్లులు, చలి గాలులు
- తడిచిన ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం

శ్రీకాకుళం: అన్నదాతలను నిలువునా వణికించిన మిచాంగ్ జిల్లాకు పెద్దగా నష్టం చేయకుండా కరుణించింది. తుఫాన్ తీరం దాటే సమయంలో జిల్లాలో పలు ప్రాంతాల్లో గాలులతో పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించటంతో దాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రైతులు కూడా పొలాలకు పరుగులు తీశారు. అయితే జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి తేలికపాటి జల్లులు మాత్రమే కురిశాయి. దీంతో ఎలాంటి నష్టం జరగలేదు. సోమవారం తెల్లవారు జాము నుంచి కురిసిన వర్షాలకు పొలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంట, కోసి కుప్ప పెట్టేందుకు సిద్ధంగా ఉన్న పంట నీట మునిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నుంచి అధికారులు ధాన్యం కొనుగోలు వేగవంతం చేశారు. తడిచిన ధాన్యం కొనేందుకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు.

మరో 48గంటల పాటు అప్రమత్తత

తుఫాన్ బాపట్ల సమీపంలో మంగళవారం సాయంత్రం తీరం దాటినప్పటికీ మరో 48 గంటల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నారు. మత్స్యకారులు కూడా చేపల వేటకు సముద్రంలోనికి వెళ్లవద్దని అప్రమత్తం చేస్తున్నారు. మత్స్యకార గ్రామాల్లో ప్రచారం చేశారు. పంటనష్టం అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం ఉదయం నుంచి జిల్లావ్యాప్తంగా పర్యటనలు ప్రారంభించారు.

36.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

జిల్లాలో మంగళవారం సాయంత్రం వరకు 36.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మందసలో 4.2 మిల్లీమీటర్లు, కంచిలిలో 2.8, ఎల్.ఎన్.పేటలో 2.6, కోటబొమ్మాళి, హిరమండలంలో 2.4, సంతబొమ్మాళి, పాతపట్నంలో 2, నందిగాం, కొత్తూరులో 1.8, పలాస, టెక్కలిలో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోంపేట, గారలో 2.2 మిల్లీమీటర్లు, సరుబుజ్జిలిలో 1.6, కవిటి, లావేరులో 1.2, పోలాకి, రణస్థలంల్లో 1, శ్రీకాకుళంలో 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాత్రి మళ్లీ పలు చోట్ల వర్షాలు కురిశాయి.

క్షేత్రస్థాయిలో నష్టాల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: మిచాంగ్ తుఫాన్ నష్టాలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలేం మత్స్యకార గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తుపాను ప్రభావంపై స్థానిక మత్స్యకారులను ప్రశ్నించారు. సర్పంచ్ అల్లు లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మడ్దులక్ష్మణ రావు తదితరులు కలెక్టర్‌కు తమ సమస్యలు వివరించారు. నాలుగు రోజులుగా వేటకు వెళ్లకపోవటం వల్ల ఉపాధి కోల్పోయామని, మత్స్యకారులకు జీవన భృతి అందజేసి ఆదుకోవాలన్నారు. వాతావరణం కుదురుకునేంత వరకు చేపల వేటకు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు ఆర్డీఓ చెరుకూరి రంగయ్య, తహసీల్దార్ టి. సత్యనారాయణతో కూడిన అధికారులు ఉన్నారు.



బుడగుట్లపాలెం తీరంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

పడవలు భద్రం

కవిటి: తుఫాన్ నేపథ్యంలో ఎవరూ సముద్రంలోకి వెళ్లవద్దని కవిటి తహసీల్దార్ పి.శేఖర్ హెచ్చరించారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఇద్దివానిపాలెం,సీహెచ్ కపాసుకుద్ది మత్స్యకార గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులతో మాట్లాడారు. రెండు రోజులుగా సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో మత్స్యకారులు తమ వేటను ఆపేసి బోట్లను, వలలను సురక్షిత ప్రదేశాలకు తరలించారు.



కపాసుకుద్దితీరంలో భద్రపరిచిన మత్స్యకారుల బోట్లు, తెప్పలు



గార మండలం బందరువానిపేట సముద్ర తీరంలో..



తుఫాన్ గాలికి ఇసుకలో కూరుకుపోయిన వలలు



సరుబుజ్జిలి: మూలసవలాపురం వద్ద నేలకొరిగిన చేను



ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహీంబాద్‌లో పరిస్థితి



జగనన్నే బతుకులు మార్చారు



ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా మా బతుకులు మారలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాకే మా బతుకుల్లో వెలుగులు వచ్చాయి. నా భర్త వ్యవసాయ కూలి. ఇంటి స్థలం కొద్దిగా మాకు ఉన్నా ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. అప్పటి ప్రభుత్వాలు ఇంటిరుణం మంజూరు చేయకపోవడంతో అద్దె ఇంటిలోనే నివాసం ఉంటున్నాం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయడంతో నూతన ఇంటిని నిర్మించుకోగలిగాం. ప్రస్తుతం ఇప్పుడు ఆ ఇంటిలో నివాసం ఉంటున్నామంటే అది జగనన్న చలవే. మా బాబుకు అమ్మ ఒడి పథకం వస్తుంది. వైఎస్సార్ ఆసరా కింద నాకు మూడు విడతలుగా రూ.42 వేలు అందాయి. గత ఏడాది నుంచి వైఎస్సార్ చేయూత అందుతోంది. పేదలకు సంక్షేమ పథకాలు అందజేసి, అన్ని విధాలుగా మేలు చేస్తున్న జగనన్నే ముఖ్యమంత్రిగా కొనసాగాలి.

– తామాడ హేమావతి, పాలవలస, సోంపేట


పథకాలే శ్రీరామరక్ష..



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండ గ్రామం మాది. నాకు పెళ్లయ్యాక సూదికొండకు వచ్చాం. మా ఆయన మృతి చెందారు. నేను ఒంటరిగా జీవిస్తున్నాను. టైలరింగ్ చేస్తూ ఉపాధి పొందుతున్నాను. నాకు సొంతిల్లు అంటూ ఏమీ లేదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక నాకు ఇల్లు మంజూరైంది. మూడు లక్షల విలువైన స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందించారు. నిర్మాణంలో ఉచితంగా నాలుగు ట్రాక్టర్ల ఇసుక, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయం కల్పించారు. అంతే కాకుండా వైఎస్సార్ చేదోడు పథకం, మా పిల్లలకు జగనన్న అమ్మ ఒడి, నా భర్త మరణించినందున నాకు వైఎస్సార్ పింఛన్ అందిస్తున్నారు. జగనన్న పథకాలతోనే నా జీవితం సాఫీగా సాగుతోంది.

– కణితి రోజా, 19వవార్డు, సూదికొండ, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

ఆకట్టుకున్న శ్రీకూర్మం సైకత శిల్పం



ఒడిశా రాష్ట్రం పూరీలో జరుగుతున్న అంతర్జాతీయ సైకత శిల్ప కళా ఉత్సవాల్లో ఆమదాలవలసకు చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ తీర్చిదిద్దిన సైకత శిల్పం పలువురిని ఆకట్టుకుంది. చివరి రోజు మంగళవారం హరికృష్ణ ప్రఖ్యాత కూర్మనాథ స్వామి ఆలయాన్ని సైకత శిల్పం రూపంలో తీర్చిదిద్దారు.

– ఆమదాలవలస రూరల్

విద్యుత్ శాఖకు జీరో లాస్

అరసవల్లి: తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ శాఖ సర్వసన్నద్ధమైంది. అయితే అనుకున్నంత ప్రభావం చూపకపోవడంతో జీరో లాస్‌తో ఊపిరి పీల్చుకున్నట్లు ఆ శాఖ సిబ్బంది చెబుతున్నారు. జిల్లాలో కూడా వర్షాలు మాత్రమే అక్కడక్కడ కురవడంతో ఇబ్బందులు కలుగలేదు. జిల్లా వ్యాప్తంగా ఒక్క విద్యుత్ స్తంభం కూడా కూలిపోలేదని, దీంతో తమ శాఖకు ఎలాంటి ఆస్తి నష్టం గానీ ప్రాణ నష్టం గానీ వాటిల్లలేదని సర్కిల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి తెలిపారు.

వ్యవసాయ భూమి పట్టాల పంపిణీ

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం కొందరికి వ్యవసాయ భూమి పట్టాలను రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతులమీదుగా అందజేశారు. సంక్షేమం, అభివృద్ధిలో ఈ ప్రభుత్వం ముందుకు దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వెంకటరావు, పార్టీ నాయకులు అంబటి శ్రీనువాసరావు, గుండ మోహన్, గుండ ఆదిత్యానాయుడు, బగ్గు అప్పారావు, శంకర్ పాల్గొన్నారు.



మంత్రి చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

లాభాల బాటలో మహిళా మార్ట్



నరసన్నపేట పాతబస్టాండ్‌లోని మహిళా మార్ట్

- నరసన్నపేట మహిళా మార్ట్‌లో చక్కగా విక్రయాలు
- రోజుకు రూ.లక్షకుపైగానే వ్యాపారం
- ధరలు తక్కువే అంటున్న వినియోగదారులు
- నాలుగో తేదీన విక్రయాల్లో రాష్ట్రంలోనే టాప్



నరసన్నపేట: స్థానిక మహిళా మార్ట్ లాభాల బాటలో నడుస్తోంది. గత ఏడాది డిసెంబర్ 14న మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. ఇప్పటివరకు ఇక్కడ రూ.1,96,77,449 లు మేరకు వ్యాపారం జరిగింది. సరాసరిన రోజుకు రూ. 90 వేల నుంచి రూ.లక్ష వరకూ విక్రయాలు చేస్తున్నారు. ఖర్చులు పోను రూ.20 లక్షల వరకు లాభాలు ఆర్జించినట్లు మేనేజర్ చెబుతున్నారు. రాష్ట్రంలో జగనన్న మహిళా మార్ట్‌లు 45 ఉండగా నరసన్నపేట మార్ట్ అత్యధిక విక్రయాలు సాధించిన మొదటి ఐదు మార్టుల్లో చోటు సంపాదించింది. డిసెంబర్ 4వ తేదీన రూ.1,25,555ల మేరకు వ్యాపారం జరిగింది. ఆ తేదీలో రాష్ట్రంలోనే అత్యధిక వ్యాపారం చేసిన మార్ట్‌గా ఇది నిలిచింది.

మండలంలో 1998 మహిళా సంఘాలు ఉండగా 24,512 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 22,500 మంది మహిళా మార్ట్‌లో రూ. 110 చొప్పున షేర్ ధనం కట్టారు. వీరందిరి భాగస్వామ్యంతోనే మార్ట్ నడుస్తోంది. కార్పొరేట్ సూపర్ మార్కెట్‌లకు ఏ మాత్రం తీసిపోని రీతిలో అన్ని రకాల సరుకులు అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే స్వయం శక్తి సంఘాల మహిళలు తయారు చేస్తున్న వివిధ రకాల వస్తువులు కూడా ఇక్కడ విక్రయాలకు ఉంచుతున్నారు. మహిళా గ్రూపుల సభ్యులతో పాటు పట్టణ ప్రజలు, ఇతరలు కూడా మార్ట్‌లో సరుకులు కొనుగోలు చేస్తున్నారు. ఇతర మార్ట్‌లతో పోల్చితే తక్కువ ధరకే ఇక్కడ సరుకులు అందుబాటులో ఉండటంతో రోజురోజుకీ విక్రయాలు పెరుగుతున్నాయి. ఫలితంగా మార్ట్ లాభాలు ఆర్జిస్తోంది. ఇక్కడ పూర్తిగా మహిళలే వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

నాణ్యతకే ప్రాధాన్యం



మార్ట్‌లో ఎక్కడా రాజీ లేకుండా నాణ్యమైన సరుకులు అందుబాటులో ఉంచుతున్నాం. పేరున్న కంపెనీలకు చెందిన సరుకులు తెప్పిస్తున్నాం. ప్రధానంగా నాణ్యతలో రాజీ లేకుండా చూసుకుంటూ ఇతర మార్ట్‌లతో పోల్చితే తక్కువ ధరకే సరుకులు విక్రయాలు చేస్తున్నాం. దీంతో రోజురోజుకీ విక్రయాలు పెరుగుతున్నాయి. మహిళలు మరింతగా ముందుకు రావాలి.

– మామిడి నాగరాజు, మార్ట్ మేనేజర్

సరుకులు బాగున్నాయి



నరసన్నపేట మహిళా మార్ట్‌లోనే ఎప్పుడూ సరుకులు కొనుగోలు చేస్తున్నాను. ప్రైవేటు మార్ట్‌లతో పోల్చితే ఇక్కడ తక్కువకే సరుకులు లభిస్తున్నాయి. నాణ్యత కూడా బాగుంది. కంది పప్పు బయట మార్కెట్‌లో రెండో రకం కేజీ రూ. 180 లకు అమ్ముతుంటే ఈ మార్ట్‌లో ఒకటో రకం కందిపప్పు కేజీ రూ. 170 లకే ఇస్తున్నారు. ఈ విధంగా ఇతర సరుకులు కూడా నాణ్యతగా తక్కువ ధరలకు ఇస్తున్నారు.

– నీలిమ, వీవో గ్రామదేవత సంఘం, వెంకటాపురం

గడిచిన మూడు నెలల్లో విక్రయాలు / ఈ నెలలో విక్రయాలు

సెప్టెంబర్	అక్టోబర్	నవంబర్	ఒకటో తేదీన	రెండో తేదీన	మూడో తేదీన	నాలుగో తేదీన
రూ. 28,42,465	రూ. 26,27,706	రూ. 29,63,226	రూ.97,909	రూ.66,071	రూ.1,21,384	రూ.1,25,555

క్లుప్తంగా

కుటుంబం చెంతకు బాలుడు


కన్నా బెహరా

కాశీబుగ్గ: అదృశ్యమైన బాలుడు ప్రత్యక్షమైన ఘటన మంగళవారం పలాసలో చోటుచేసుకుంది. కంచిలి మండలం టి.శాసనం గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి కన్నా బెహరా సోమవారం అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బృందాలుగా వీడి పలు ప్రాంతాల్లో వెతికారు. ఎట్టకేలకు మంగళవారం పలాస రైల్వే స్టేషన్‌లో బాలుడు కనిపించడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. కంచిలి పోలీసులకు విషయం తెలియజేసి అనంతరం ఇంటికి చేరుకున్నారు.

బైక్ దగ్ధం


కాలిపోయిన బైక్

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట పంచాయతీ లక్ష్ముడిపేటలో సీపాన రామ్మోహన్‌రావుకు చెందిన ద్విచక్ర వాహనం(హీరో స్ప్లెండర్ ప్రో) దగ్ధమైంది. మంగళవారం తన ఇంటి వద్ద బైక్ స్టార్ట్ చేయగా కేశవరావుపేట రోడ్డులో ఆగిపోయింది. మళ్లీ స్టార్ట్ చేసి వెళ్తుండగా పొగ రావడంతో బైక్ నిలిపి వేసి స్టాండ్ వేశాడు. ఒక్కసారిగా పెంట్రోల్ ట్యాంకు నుంచి మంటలు వచ్చి బైకు మొత్తం కాలిపోయింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు చెప్పాడు.

కొండపేటలో వరికుప్పలు దగ్ధం


కాలిపోయిన వరికుప్ప

సరుబుజ్జిలి: బూర్జ మండలం పెద్దపేట పంచాయతీ కొండపేటలో పాలక శంకరయ్యకు చెందిన సుమారు 5 ఎకరాల వరికుప్పలు సోమవారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. చుట్టూ వరికుప్పలు ఉన్నా ఈ కుప్ప మాత్రమే దహనం కావడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే ఆమదాలవలస అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. పంటనష్టం సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనావేశారు. బాధిత కుటుంబాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో మంగళవారం గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టికెట్ కౌంటర్ వద్ద సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో ఓ మహిళ మరుగుదొడ్ల శుభ్రతకు వినియోగించే యాసిడ్ బాటిల్ తాగి పడిపోయింది. వెంటనే స్థానికులు ఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం 108 అంబులెన్సులో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మహిళ వివరాలు తెలిసిన వారు పలాస ఆర్‌పీఎఫ్ పోలీసులకు సంప్రదించాలని కోరారు.

టెక్కలిలో యువకుడి వీరంగం

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని గోపినాథపురానికి చెందిన పద్మనాభం అనే యువకుడు వీరంగం సృష్టించాడు. ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితం లేకపోవడంతో పద్మనాభం అనే యువకుడు రెండురోజులుగా హల్‌చల్ చేస్తున్నాడు. ఈ విషయమై స్థానికులు మంగళవారం సాయంత్రం టెక్కలి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విషయం చెబుతుండగా అక్కడికి చేరుకుని దాడికి పాల్పడుతుండగా పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యపరీక్షల అనంతరం బుధవారం టెక్కలి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని తెలిపారు.

పీఎంజేఏవై సేవలపై అవగాహన

పాతపట్నం: ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన(పీఎంజేఏవై)ను వినియోగించుకోవాలని బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ అన్నారు. ఈ మేరకు బూరగాంలో పథకం ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్ రెండో భాగంగా ఈ పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో లింగరాజు, సర్పంచ్ బిజిలిపుల్లాయ్, ప్రహ్లాద పుల్లాయ్ పాల్గొన్నారు.

ఉద్యోగమే లక్ష్యంగా.. నైపుణ్య శిక్షణ

- స్కిల్ హబ్‌లో స్వల్పకాలిక కోర్సుల్లో ట్రైనింగ్
- మూడున్నర నెలల పాటు శిక్షణ
- కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతిఒక్కరికి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని కోరిక ఉంటుంది. అయితే కొన్ని పరిస్థితులు కారణంగా ఉన్నత చదువులు పూర్తి చేయలేని పరిస్థితి. చాలామంది పదో తరగతి, ఇంటర్మీడియెట్ వంటి కోర్సులకే పరిమితమవుతుంటారు. ఉద్యోగం చేయాలనే తపన ఉన్నా సరైన నైపుణ్యాలు లేక కొలువుల వేటలో వెనుకబడి పోతుంటారు. ఇలాంటి వారికి సుశిక్షితమైన ట్రైనింగ్ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లు నిర్వహిస్తోంది. మన జిల్లాలో ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో 2022 అక్టోబర్‌లో స్కిల్ హబ్ పేరిట శిక్షణ సంస్థను ఏర్పాటు చేశారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఆధారంగా శిక్షణ ఇచ్చి ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పిస్తున్నారు.


స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ పొందుతున్న యువత

డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో..

ప్రస్తుతం స్కిల్ హబ్‌లో ఇంటర్మీడియట్ కనీస విద్యార్హత గల విద్యార్థులకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ ఇస్తున్నారు. కోర్సు కాల వ్యవధి మూడున్నర నెలలు. 26 మంది అభ్యర్థులు ఇప్పటికే 20 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఉపాధి లక్ష్యంగా డిగ్రీ పూర్తిచేసిన యువత సైతం ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. కంప్యూటర్ వినియోగం, ఎంఎస్ ఆఫీస్, ఇంగ్లీష్, తెలుగు టైపింగ్‌లపై మెలకువలు నేర్పిస్తున్నారు. మూడు నుంచి మూడున్నర నెలల వ్యవధిలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్స్ వంటి అంశాల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన వారికి విశాఖపట్నం, విజయవాడ, కడప తదితర ప్రాంతాల్లోని ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నారు. రూ. 10 వేలు నుంచి రూ. 15 వేలు వరకు ప్రారంభ జీతం ఇస్తున్నారు. నైపుణ్యం, సీనియారిటీ ఆధారంగా భవిష్యత్తులో జీతాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

ఉద్యోగం కోసం..



మాది వ్యవసాయ కుటుంబం. బీఎస్సీ డిగ్రీ పూర్తిచేశాను. ఉద్యోగం కోసం ప్రయత్నించినప్పుడు చాలా మంది కంప్యూటర్ నాలెడ్జ్ ఉందా అని ప్రశ్నించారు. అందుకే డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో చేరాను. ట్రైనింగ్ పూర్తయ్యాక ఉద్యోగం వస్తుందనే నమ్మకం ఉంది.

– జి.కళావతి, నాగంపాలేం, లావేరు మండలం

ఉపాధి కల్పిస్తున్నాం..



ఉద్యోగాలు, ఉపాధి లక్ష్యంగా స్కిల్ హబ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నాం. 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన యువత లక్ష్యంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్స్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ వంటి స్వల్ప కాలిక కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పిస్తున్నాం.

– బి.స్వప్నదేవి, ఎచ్చెర్ల ఐటీఐ స్కిల్ హబ్ కో ఆర్డినేటర్

నైపుణ్యాలు పెంచుకునేందుకు..



బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశాను. ప్రస్తుతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాలంటే నైపుణ్యాలు తప్పనిసరి. పరిశ్రమలు, విద్యా సంస్థల్లో స్కిల్స్ ఉంటే సులువుగా ఉద్యోగాలు పొందవచ్చు. ప్రధానంగా కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. అందుకే స్కిల్ హబ్‌లో చేరాను.

– ఎన్.దేవి, నారువ, రణస్థలం మండలం

దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు


సరుబుజ్జిలి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: దళారీల ప్రమేయం లేకుండా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ పీఏసీఎస్‌కు చెందిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అన్నంపేటలో ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రూ.25లక్షలతో నిర్మించనున్న రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాహ్వానితుడు కర్నేని నాగేశ్వరరావు, జెడ్పీటీసీ బెజ్జిపురం రామారావు, టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, సచివాలయం కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు పాల్గొన్నారు.

నేలను కాపాడుకుందాం


భూమికి పూజలు చేస్తున్న నైరా యూనివర్సిటీ అసోసియేట్ డీన్ శ్రీనివాస్

శ్రీకాకుళం రూరల్: నేలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని నైరా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. నైరా కళాశాలలో మంగళవారం ప్రపంచ నేల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టిలో జీవుల మనుగడకు నేల, నీరుకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ రెండు సహజ వనరులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షపునీరు నేలల్లో ఇంకకపోతే వరదగా మారుతుందని, ఫలితంగా నేల కోతకు గురై బీటలు వారుతుందని, దీనివల్ల ఉత్పాదక శక్తి, సారం కోల్పోయి ఆహారోత్పత్తి తగ్గి దేశ ఆహార భద్రత దెబ్బతింటుందని వివరించారు. దేశంలో 65శాతం భూమి వర్షాధారంగా సాగవుతోందని చెప్పారు. కార్యక్రమంలో మృత్తికా విభాగం అధిపతి టి.శ్రీలత, బోర్డు మెంబర్ ప్రొఫెసర్ గురుమూర్తి, ఎస్.సునంద, ఉపేంద్ర పాల్గొన్నారు.

కొండప్రాంతాల్లో సాగుచేస్తున్న రైతులకు భూహక్కు


భూ హక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్, సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్

సారవకోట: కొండ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి సాగు చేస్తున్న రైతులకు భూమి హక్కులు కల్పిస్తున్నట్లు నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సారవకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పోడు వ్యవసాయం చేస్తున్న 150 మంది రైతులకు 84 ఎకరాలకు సంబంధించిన హక్కు పత్రాలను టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులకు ముఖ్యమంత్రి చొరవతో పట్టాలు అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలో 224 మంది రైతులకు హక్కు పత్రాలకు ప్రతిపాదనలు పంపించగా మొదటి విడతలో 150 మంది రైతులకు 84.24 ఎకరాలపై భూ హక్కులు కల్పిస్తూ పత్రాలు అందజేసినట్లు వివరించారు. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో చంద్రబాబు ఒక్కటీ నెరవేర్చలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ 98 శాతం హామీలు వివక్ష లేకుండా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ 70 ఏళ్ల భారతావనిలో ఏ రాష్ట్రంలోనూ భూముల రీ సర్వే జరగలేదని, మన రాష్ట్రంలోనే కొత్త టెక్నాలజీతో ప్రభుత్వం రీ సర్వే చేయించినట్లు చెప్పారు. భూ హక్కు పత్రాలు పొందిన రైతుల వివరాలు వెబ్ లాండ్‌లో నమోదు చేశామని, ఈ పత్రాల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చునని, రైతు భరోసా కూడా వర్తిస్తుందని వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ హనుమంతరావు, ఎంపీడీఓ ఆర్.రాంబాబు, ఈఓపీఆర్‌డీ రేణుక, వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, లైవ్ స్టాక్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్క తులసీదాస్, జలుమూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొంగు కొండయ్య, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, శంకరబాబు, ఇసై షణ్ముఖరావు, కొండాల బాబూరావు పాల్గొన్నారు.

పోరాట యోధుడు పాణిగ్రాహి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి జీవితం నిత్య పోరాట చైతన్యమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజాకళా మండలి రాష్ట్ర సహాయక కార్యదర్శి కొత్రాయి నీలకంఠం చెప్పారు. పలాస మండలం బొడ్డపాడులో జిల్లా అమరవీరుల స్మారక మందిరం వద్ద మంగళవారం పాణిగ్రాహి వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న సుబ్బారావు పాణిగ్రాహి సంస్మరణ సభ బొడ్డపాడులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అరుణోదయ, ప్రజాకళామండలి కళాకారులతో ఆటా పాట కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు మార్పు మల్లేశ్వరరావు, ప్రజాకళామండలి జిల్లా అధ్యక్షుడు రాపాక చిరంజీవులు, సి.పి.ఐ.ఎం.ఎల్.న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకురాలు పి.అరుణ, అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు గొరకల బాలకృష్ణ, ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు పోతనపల్లి కుసుమ, కుత్తుం హేమక్క, నిశితాసి, కుత్తుం ఢిల్లీరావు, ప్రజా కళాకారుడు కుత్తుం వినోద్, జి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు


రక్తదాతను సత్కరిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం కల్చరల్ : రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. ధర్మశాస్త్ర సన్నిధానం ట్రస్టు వైస్ చైర్మన్ పాలకొండ ప్రశాంత్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో రక్తం కొరత ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో బ్లడ్‌బ్యాంకుల సమన్వయంతో శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం 176 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, యువజన సర్వీసుల శాఖ సీఈవో బి.వి.ప్రసాదరావు, ఏఎస్పీ విఠలేశ్వరరావు, రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు నటుకుల మోహన్, ఎస్.జోగినాయుడు, జి.ఇందిరా ప్రసాద్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హారికా ప్రసాద్, పి.చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, సన్నిధానం ట్రస్టు చైర్మన్ బరాటం సంతోష్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోర్టు విధుల బహిష్కరణకు తీర్మానం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ) : ఈ నెల 6, 7, 8వ తేదీల్లో కోర్టు విధులను బహిష్కరించాలని జిల్లా బార్ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అత్యవసర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. జిల్లా కోర్టు పరిధిలో ఉన్న అన్ని కోర్టుల్లోనూ నూతన ల్యాండ్ టైటిల్ యాక్టు, న్యాయవాదులకు ఇచ్చే డెత్ బెనిఫిట్ పెంచాలని కోరుతూ ఈ తీర్మానం చేసినట్లు సెక్రటరీ పొన్నాడ రాము తెలిపారు. తీర్మాన కాపీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులకు అందజేశారు.

తైక్వాండో పోటీల్లో పతకాల పంట



తైక్వాండో ఆఫ్ ఇండియా ప్రతినిధులతో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ తైక్వాండో పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు హవా కనబర్చారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ వేదికగా ఈ నెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఆలిండియా సబ్-జూనియర్స్, క్యాడెట్స్ బాలబాలికల తైక్వాండో చాంపియన్ షిప్-2023 పోటీలు జరిగాయి. ఇందులో క్యాడెట్ అండర్-33 విభాగంలో కారె మోక్షిత్ రజతం, అండర్-37 విభాగంలో తాన్ని ఢిల్లేశ్వరరావు కాంస్యం, బాలికల అండర్-26 విభాగంలో పెద్దింటి యషిత స్వర్ణం, దువ్వ త్రివేణి కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. వీరిని తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ప్రభాస్ కుమార్‌శర్మ, న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అచ్యుతరెడ్డి మంగళవారం అభినందించారు. తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్ రావు, జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, తైక్వాండో కోచ్ కురిటి తారకరామ, కొమర మోహన్ కృష్ణ, రెడ్డి సాయిరాం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


ప్రశాంత్ (ఫైల్)

కొత్తూరు: మండలంలోని గులివిందలపేటకు చెందిన కోడిపాత్రుని ప్రశాంత్(20) మెట్టూరు బిట్-2 ఆర్‌ఆర్ కాలనీ వద్ద మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంత్ అయ్యప్ప మాల ధరించాడు. మెట్టూరు బిట్-3లోని సన్నిధానం నుంచి మెట్టూరు సెంటర్‌కు నడిచి వస్తుండగా వర్షం కారణంగా జారిపడ్డాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని పట్టుకోవడంతో షాక్‌కు గురయ్యాడు. అప్పటికే స్తంభానికి విద్యుత్ సరఫరా కావడం, మాలధారణ కారణంగా చెప్పులు ధరించకపోవడంతో షాక్‌కు గురైనట్లు భావిస్తున్నారు. వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎంఏ అహ్మద్ చెప్పారు. మృతుడి తల్లి రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రశాంత్‌కు తల్లిదండ్రులు ధర్మారావు, రాములమ్మ, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. ఇంతలోనే కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

ట్రైనీ బీఎస్‌ఎఫ్ జవాన్ ఆత్మహత్య


మోడి మధురెడ్డి(ఫైల్)

సంతబొమ్మాళి: మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన ట్రైనీ బీఎస్‌ఎఫ్ జవాన్ మోడి మధురెడ్డి (23) మంగళవారం జమ్ముకాశ్మీర్‌లో ట్రెనింగ్ సెంటర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎస్‌ఎస్‌సీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన మధురెడ్డి బీఎస్‌ఎఫ్ జవాన్‌గా ఎంపికై మూడు వారాలుగా శిక్షణ పొందుతున్నాడు. మంగళవారం ఉదయం శిక్షణకు రాకపోవడంతో తోటి జవాన్లు వెళ్లి చూడగా గదిలో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడన్న కొడుకు అనంతలోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు ఈశ్వరరావు, ఆదిలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మధురెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

కందిసాగు.. గట్టుపైనే బాగు


గొట్టిపల్లి ప్రాంతంలో పొలం గట్లపై కంది సాగు

- ఒకేసారి రెండు పంటలతో రైతులకు మేలు
- కాలువ, చెరువు గట్లపై సాగుపై ఆసక్తి

ఎల్.ఎన్.పేట: ఒకప్పుడు గిరిజన ప్రాంతాల్లో కొండపోడు పంటగా సాగుచేసే కంది పంట నేడు సాగునీటి చెరువులు, పొలాలు, కాలువ గట్లపైకి చేరింది. ఖరీఫ్ వరిసాగు సమయంలో వరి సాగు చేసే రైతులు నడిచేందుకు పొలం, చెరువు, కాలువ గట్లు ఖాళీగానే వదిలేస్తారు. ఆ గట్లపై కొందరు రైతులు కంది విత్తనాలు వేసి వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది కంది సాగు విస్తీర్ణం పెరిగింది. పాతపట్నం నియోజకవర్గంలో ఐదు మండలాల్లోనూ రైతులు పొలం గట్లపై కంది సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇంటి అవసరాలకు సరిపడా కందిపప్పు దిగుబడిని గట్లుపైనే పండిస్తున్నారు. వృథాగా వదిలేసే బదులు ఈ విధంగా గట్టుపై పంటలు పండించి ఆదాయం పొందవచ్చని అనేక మంది రైతులు నిరూపిస్తున్నారు.


కృష్ణాపురంలో పొలం గట్టుపై కంది సాగు

760 కిలోల విత్తనాల పంపిణీ..

పప్పుధాన్యాల సాగు ప్రోత్సాహంలో భాగంగా హిరమండలం, మెళియాపుట్టి, కొత్తూరు, పాతపట్నం, ఎల్.ఎన్.పేట మండలాల్లో 985 మంది రైతులకు 760 కిలోల కంది విత్తనాలు పూర్తి రాయితీపై (ఉచితంగా) పంపిణీ చేశారు.


పంట బాగుంది



ఉపాధి హామీ పథకంలో భాగంగా గట్టుపై పిచ్చిమొక్కలు తొలగించారు. పొలం గట్లతో పాటు చెరువు గట్టుపై కంది విత్తనాలు వేసుకున్నాను. ఈ ఏడాది మొక్కలు చాలా బాగున్నాయి. ఇంటి అవసరాలకు సరిపడా కందుల దిగుబడి వస్తాయని అనుకుంటున్నాను. కంది పంట కోసం ఎలాంటి పెట్టుబడులు పెట్టలేదు. ఒక రోజు విత్తనాలు వేశానంతే..

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

ఉచితంగా విత్తనాలు..



పప్పుధాన్యాల సాగు ప్రోత్సాహంలో భాగంగా ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి సాగునీటి కాలువలు, చెరువులు, పొలం గట్లపై కంది సాగు చేసేందుకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేశాం. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువ మంది రైతులకు ఎక్కువ విత్తనాలు ఇచ్చాం. జాగ్రత్తలు వివరించాం. సాగు విస్తీర్ణం కూడా పెరిగింది.

– పైడి లతశ్రీ, ఏఓ, ఎల్.ఎన్.పేట

సుమారు 1500 ఎకరాల మేర గట్లుపై కంది విత్తనాలు సాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

గట్లు నిండా కంది మొక్కలే..

ఖరీఫ్ వరి పంటతో పాటు జూన్, జూలై నెలల్లోనే గట్లుపై కంది విత్తనాలు వేస్తున్నామని రైతులు చెబుతున్నారు. వరి పంటకు ఎరువు వేసిన సమయంలో కంది మొక్కలకు కాస్త ఎరువు పడినట్లు విసిరేస్తున్నామని, అంతకంటే పెట్టుబడి ఏమీ లేదంటున్నారు. ఎలాంటి పెట్టుబడి లేకుండా దిగుబడి వస్తుందని దబ్బపాడు, తురకపేట, జాడుపేట, కొమ్మువలస, గొట్టిపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు పల్లి అప్పలనాయుడు, కె అచ్యుతరావు, కర్నం చంద్రినాయుడు, శిమ్మ శ్రీరాములు తదితరులు చెబుతున్నారు.